నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



చంపాపేట: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.

- ఉదయం 8 నుంచి 11 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ఐఎస్‌సదన్, డీఎస్ నగర్, సెంట్రల్ ఎక్సేంజ్, ఈస్ట్ మారుతీనగర్, యాదగిరినగర్, దుర్గాభవానీనగర్ కాలనీలు.
- **ఉ.10.30 నుంచి 11 గంటల వరకు..** రెడ్డి కాలనీ, బాలాజీనగర్, కృష్ణానగర్, ఎస్‌జీఆర్ కాలనీలు
- **ఉ 10.30 నుంచి 11 గంటల వరకు..** పటేల్‌నగర్, కటకోనికుంట, చంపాపేట పాత బస్తీ, నేతాజీనగర్, చంపాపేట మెయిన్ రోడ్, గాంధీ విగ్రహం చౌరస్తా ప్రాంతం, రాజిరెడ్డినగర్, బృందావన్, బాలాజీనగర్ కాలనీలు.
- **సా. 3 నుంచి 5 గంటల వరకు..** పోచమ్మగడ్డ, మారుతీనగర్, లిబర్టీ రోడ్, అంబేద్కర్‌వాడ పరిసర ప్రాంతాలు.

సైదాబాద్: ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్‌లో...

- **ఉ. 6 నుంచి 8 గంటల వరకు...** ఐబీపీ పెట్రోల్ పంప్ ఐస్‌సదన్ క్రాస్‌రోడ్స్ పరిసర ప్రాంతాలు
- **ఉ. 10 నుంచి 12 వరకు..** అక్బర్‌బాగ్, పల్టన్ చౌరస్తా, దయానంద్ నగర్, ఆనంద్‌నగర్, మలక్‌పేట పరిసర ప్రాంతాలు.
- **మధ్యాహ్నం 12 నుంచి 1.30 వరకు..** వాణీ కాలేజ్, కిడ్నీ హాస్పిటల్, నల్గొండ క్రాస్ రోడ్, సోహైల్ హోటల్ పరిసరాలు.
- **మ. 3 నుంచి సా. 5 వరకు..** డాన్ స్కూల్, బీబీ క్యాన్సర్ హాస్పిటల్, ఇబ్రహీం ఫంక్షన్‌హాల్, మౌళీ కా మాస్క్, బాబుమియా గిర్నీ పరిసర ప్రాంతాలు
- **ఉ. 10 నుంచి 11.30 వరకు..** నాగబౌలి బిస్నీసాబ్ బంగ్లా, కమలేషా మాస్క్, ఫరత్ నగర్ గ్రేవ్‌యార్డ్,ఎమ్మార్వో ఆఫీస్ పరిసరాలు.
- **ఉ. 11.30 నుంచి మ.ఒంటి గంట వరకు..** పెంటయ్య బ్యాండ్, బీబీకా ఆల్వా, కాలీ మజీద్, కమలేషా దర్గా, జబ్బార్ హోటల్ పరిసర ప్రాంతాలు
- **మ. 2 నుంచి సా. 3.30 వరకు..** డబీర్‌పురా మెయిన్‌రోడ్, యాసీన్ జంగ్ పరిసర ప్రాంతాలు
- **మ. 3:3 నుంచి సా. 5 గంటల వరకు..** మోతీ మసీద్, నాలా, బడా మందిర్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

నాలాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోండి



నాలా పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్, ఏఈ తదితరులు

చైతన్యపురి: కాలనీల్లో మురికి కాలువలు, నాలాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని పటేల్‌నగర్ కాలనీ శ్రీసాయి రెసిడెన్సీ వద్ద జరుగుతున్న నాలా పూడిక తీత పనులను జీహెచ్‌ఎంసీ ఏఈ రూప, జలమండలి మేనేజర్ రజితతో కలిసి పరిశీలించారు. పూడిక తీత పనులు వేగవంతం చేసి వర్షం నీరు సాఫీగా వెళ్లే విధంగా చేయాలన్నారు. అలాగే నాలాల నుంచి తీసిన మట్టిని వెంటనే తొలగిస్తే కాలనీవాసులకు ఇబ్బందులు కలుగకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రఘు, స్థానిక నాయకులు రవికుమార్, రఘునందన్, టింకు, గిరీష్ గౌడ్, రాము పాల్గొన్నారు.

దాతల సహకారంతో భక్తులకు మరిన్ని సౌకర్యాలు



అర్జిత సేవల టికెట్లు అందజేసే కియోస్ స్కానింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న నల్లా రఘుమారెడ్డి

చంపాపేట: దాతల సహాయ, సహకారాలతో కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి అన్నారు. ఆలయంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన బ్రిజ్ భూషణ్ సింగ్ జ్ఞాపకార్థం ఆయన మనుమడు రాణా శౌర్యసింగ్, శిరీషా రాజశేఖర్ రెడ్డి, అఖిల్‌రెడ్డి, కర్మన్‌ఘాట్ బ్రాంచ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో వంటశాలను ఆధునీకరించడంతో పాటు అన్నిరకాల సేవల టికెట్‌లు పొందేందుకు కియోస్ స్కానింగ్ మిషన్లను ఏర్పాటు చేశారు. వీటిని దాతలతో కలిసి రఘుమారెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ, సభ్యులు సురేందర్‌రెడ్డి, చాతిరి మధుసాగర్, మధుసూదన్‌రెడ్డి, తిరుమలేష్, సురేష్, అంజిరెడ్డి, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

‘ఓజోన్’లో కార్డియో థొరాసిక్ ఆపరేషన్ థియేటర్ ప్రారంభం



ఆపరేషన్స్ థియేటర్ ప్రారంభిస్తున్న చైర్మన్ సత్యసాయి ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని ఓజోన్ ఆస్పత్రిలో కార్డియో థొరాసిక్ ఆపరేషన్స్ థియేటర్‌ను ఆస్పత్రి చైర్మన్ సత్యసాయి ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి మంగళవారం ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో గుండె శస్త్ర చికిత్స సేవలు అందించే ఆస్పత్రులు చాలా తక్కువ ఉన్నాయన్నారు.ఆరోగ్యశ్రీ పథకంలో ఈ శస్త్ర చికిత్స కేవలం ఓజోన్ ఆసుపత్రిలో మాత్రమే ప్రారంభిస్తున్నామన్నారు. అందరికీ నాణ్యమైన వైద్యాన్ని అతి తక్కువకు అందించడమే ఓజోన్ ఆస్పత్రి లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ పూజిత,డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, డా.మధుసూదన్ రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



ఎన్టీఆర్ చౌరస్తాలో.. నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: మహానటుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు 101వ జయంతిని ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆయన చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు.

మైసమ్మ సన్నిధిలో సబితారెడ్డి

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండిలో కొలువైయున్న మైసమ్మ దేవతను మంగళవారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు ఉన్నారు.



మైసమ్మను దర్శించుకున్న సబితారెడ్డి, నాయకులు

ఇంకెన్ని రోజులు ఇలా వదిలేస్తారు?

ఇటీవల గాలి వానకు విరిగిపడ్డ చెట్లకొమ్మలు

- రోడ్లపై కొన్ని పడి ఉండగా, చెటపైనే వేలాడుతున్న మరికొన్ని.
- తొలగించడంలో అధికారుల నిర్లక్ష్యం
- రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం



విద్యుత్ తీగలకు తాకుతున్న విరిగిన చెట్టుకొమ్మ

లింగోజిగూడ: రెండ్రోజుల క్రితం వచ్చిన గాలి వానకు ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కాలనీల్లో కొన్నిచోట్ల భారీ చెట్లు నేలకూలగా, మరి కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. వాటిని జీహెచ్‌ఎంసీ, విద్యుత్ అధికారులు తొలగించకపోవడంతో కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గాలి దుమారం వచ్చిన రోజున ఆయా శాఖల సిబ్బంది తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు. రోడ్లపై పడిన చెట్ల కొమ్మలతో పాటు చెట్లపై ఉన్న విరిగిన కొమ్మలను కూడా తొలగించలేదు. దీంతో ఆయా కాలనీల ప్రజలతో పాటు వాహదారులు ఇబ్బందులు పడుతున్నారు.విరిగిన చెట్ల కొమ్మలు గాలికి ఊగుతూ విద్యుత్ వైర్లకు తాకుతుండటంతో కాలనీల్లో నిత్యం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. విరిగిన కొమ్మలను తొలగించాలని జీహెచ్‌ఎంసీ, విద్యుత్ శాఖల అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. గాలిదుమారం వచ్చి రెండ్రోజులు గడుస్తున్నా పూర్తి స్థాయిలో చెట్లను, కొమ్మలను అధికారులు తొలగించకపోవడంతో తాము అవస్థలకు గురవుతున్నామని, ఇంకా ఎన్ని రోజులు ఇలా వదిలేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్లపై ఒకపక్క చెట్ల కొమ్మలు పడి ఉండటం, మరోపక్క వర్షానికి రోడ్లపై పడ్డ గుంతలు, ఇసుక మేటల కారణంగా ప్రమాదాలకు గురవుతున్నామని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. దీనికి తోడు రాత్రి సమయంలో కాలనీల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో కూడా ఆయా మార్గాల్లో వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ, విద్యుత్ శాఖల అధికారులు స్పందించి వెంటనే చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు విద్యుత్‌ను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై నుంచి తొలగించని చెట్లకొమ్మలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

ఇటీవల వచ్చిన భారీ ఈదురు గాలులు వర్షానికి కాలనీల్లోని చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. వాటిని తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో నిత్యం విద్యుత్ సరఫరాలో సమస్య వస్తోంది.దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. వెంటనే చెట్లకొమ్మలు తొలగించి విద్యుత్‌ను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలి.

– విజయ్, విజయపురి కాలనీ, బీఎన్‌రెడ్డి నగర్

నగర ఫొటోగ్రాఫర్‌కు ‘రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీ’ గుర్తింపు

తాబేళ్ల జీవన విధానంపై తీసిన ఫొటోలకు పురస్కారం



పురస్కారాన్ని చూపిస్తున్న సతీష్ లాల్

నాగోలు: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ హైదరాబాద్‌కు చెందిన ఫొటో గ్రాఫర్ సతీష్ లాల్ అందేకర్‌కు అసోసియేట్ హానర్‌ను బహూకరించింది. ఈ సందర్భంగా మంగళవారం నాగోలు డివిజన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సతీష్‌లాల్ అందేకర్ మాట్లాడుతూ ... గత పదేళ్లుగా ఒడిషా రాష్ట్రంలోని ఆలివ్ రిడ్లీ తాబేళ్లు, వాటి జీవన విధానం, మానవ తప్పిదాల వల్ల వాటికి జరుగుతున్న ముప్పుపై తాను సమర్పించిన ఫొటో డాక్యుమెంటేషన్‌ను మెచ్చి ఈ పురస్కారం ఇచ్చారన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ రంగంలో ఫొటోగ్రాఫర్లకు వారు అందిస్తున్న రెండవ అత్యున్నత పురస్కారం మన దేశం నుంచి తనకు లభించడంఎంతో గర్వంగా భావిస్తున్నానన్నారు.

ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే సబితారెడ్డి

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పాడిపండటలతో నియోజకవర్గ ప్రజలను సుఖసంతోషాలతో చూడాలి తల్లి అని వేడుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, బీఆర్‌ఎస్ తుక్కుగూడ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, కౌన్సిలర్ సుమన్, నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా వీపీజీ ఫౌండేషన్



పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న వజీర్ ప్రకాష్‌గౌడ్

నాగోలు: పేదలకు అండగా వీపీజీ ఫౌండేషన్ ఉంటుందని పీసీసీ ప్రచార కమిటీ కో–కన్వీనర్, ఫౌండేషన్ చైర్మన్ వజీర్ ప్రకాష్‌గౌడ్ అన్నారు. మంగళవారం ప్రకాష్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా కొత్తపేట డివిజన్ మారుతినగర్‌లోని శ్రీ మల్లికార్జున వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం పేదలకు చీరలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తన నివాసంలో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్యకార్మికులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

మన్సూరాబాద్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి కోరారు. మంగళవారం ఆయన ఆటోనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న 8 పని గంటల విధానాన్ని రద్దు చేసి 12 పని గంటలుగా మార్పు చేస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టాలను తీసుకొస్తున్నదని ఆయన ఆరోపించారు. ఆటోనగర్‌లో ఈనెల 30వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామని, కార్మికుల అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నర్సిరెడ్డి కోరారు. సమావేశంలో నాయకులు ఆలేటి ఎల్లయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో ఎమ్మెల్యే పూజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: యాచారం మండలం చౌదర్‌పల్లిలోని శ్రీ హరిహర దివ్య క్షేత్రంలో మంగళవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామంలో గతేడాది గ్రామస్తులు శ్రీ హరిహర దివ్య క్షేత్రాన్ని నిర్మించారు. ఈ క్రమంలో రెండు రోజులుగాదివ్యక్షేత్రం ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరుగుతోంది. అందులో భాగంగా ఎమ్మెల్యే పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తిభావంతో ప్రశాంతత నెలకొంటుందని అన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శేఖర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, అమృతాసాగర్, అరవింద్‌నాయక్ పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాలకు అమీర్‌పేట్ పాఠశాల సిద్ధం

నేటి నుంచి రెండురోజుల పాటు వేడుకలు

- హాజరుకానున్న త్రిదండి చినజీయర్ స్వామి, పారిశ్రామికవేత్త సీబీఆర్ ప్రసాద్‌రావు



ముస్తాబైన అమీర్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

మహేశ్వరం: చదువు మనిషి జీవన గమనాన్ని మారుస్తుంది. విజ్ఞానపు వెలుగులను పంచుతుంది. అటువంటి అక్షరజ్ఞానమే అన్నింటికి మార్గం. ఈ నానుడిని నిజం చేశారు ఆ ఊరి ప్రజలు, ఆ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు. చదువుతో కలిగే ప్రజయోజనాలను ముందే పసిగట్టి అక్షర సేద్యం చేసి చదువులమ్మ ఒడికి పునాది వేశారు. తోచినంత సాయాన్ని విరాళాల రూపంలో సమకూర్చి ఉన్నత పాఠశాల నిర్మాణం, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల అప్‌గ్రేట్ చేయించారు. అ విద్యామందిరమే వేలాది మందికి విద్యాబుద్ధులు నేర్పించింది. మహేశ్వరం మండలంలోని అమీర్‌పేట్ గ్రామంలో 1956లో ప్రాథమిక పాఠశాలను అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పాఠశాలకు మహేశ్వరం మండలంతో పాటు చుట్టూ ఉన్న గ్రామాలకు చెందిన విద్యార్థులు 1 నుండి 5వ తరగతిలో విద్యను అభ్యసించేవారు. 5వ తరగతి పూర్తయిన తర్వాత పైచదువుల కోసం ఉన్నత పాఠశాల లేకపోవడంతో కొందరైతే పట్టణాలకు వెళ్లి చదివేవారు, మరికొందరు 5వ తరగతి వరకు చదివి ఆగిపోయేవారు. 1956లో బదిలీపై అమీర్‌పేట్ ప్రాథమిక పాఠశాలకు వచ్చిన నారాయణ ప్రత్యేక చొరవ తీసుకొని చుట్టూ ఉన్న గ్రామాలకు చెందిన పెద్దలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేయించి ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ కావడానికి డబ్బులు అవసరం ఉండడంతో డ్రామా మాస్టర్‌ను తీసుకొచ్చి శ్రీకృష్ణా రాయబారం, రామాంజనేయ యుద్ధం నాటకాలు ప్రదర్శించి దాని నుంచి వచ్చి డబ్బులతో పాటు గ్రామస్తుల నుంచి చందాల రూపకంగా సేకరించి ఆ డబ్బులతో పైతరగతుల అనుమతి కొరకు విద్యాశాఖ కార్యాలయంలో రూ.53వేల గ్రాంటులను జమ చేశారు. ప్రభుత్వం 1970లో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు అనుమతి ఇచ్చింది. 1974 నుంచి 10వ తరగతి ప్రారంభమై 2024 వరకు 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా అమీర్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ ఉపాధ్యాయులు, చదివిన పూర్వ విద్యార్థులందరూ కలిసి ఒక కమిటీగా ఏర్పడి స్వర్ణోత్సవ సంబురాలు రెండురోజుల పాటు చేస్తున్నారు. 29వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు చినజీయర్‌స్వామి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన, ఉపన్యాసం, స్వామివారి ఆశీర్వచనము ఉంటుంది. అనంతరం పూర్వవిద్యార్థులతో క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు, యక్షగానం(మాయసుభద్ర విలాసం) నాటికలు నిర్వహిస్తారు. 30వ తేదీన గురువారం పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల ఉపన్యాసాలు, అనుభవాలు చెప్పుకుంటారు. పారిశ్రామికవేత్త సీబీఆర్ ప్రసాద్‌రావు సందేశం, రాత్రి 8 గంటలకు పూర్వ విద్యార్థులతో శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటకం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి పాఠశాలలో చదువుకున్న వందలాది మంది పూర్వవిద్యార్థులు, విద్యను అభ్యసించిన పూర్వ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరవుతున్నారని స్వర్ణోత్సవ కమిటీ అధ్యక్షుడు కేజే.శివరాజ్, కోశాధికారి ఎం.సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.వెంకటేశ్వర్‌రెడ్డిలు పేర్కొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 23, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 18, క్యారెట్ 35. దొండ 23, ఆలు 31, ఉల్లి 24, గోకర 40, దోస 23, సొర 11, పొట్ల 15, అరటి 9, చిక్కుడు 75, అర్వి 40, మునగ 45, చిలగడదుంప 75, బీట్‌రూట్ 21, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 135, క్యాప్సికమ్ 45. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అనాథ విద్యార్థి గృహానికి రూ. 2 లక్షల విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: నగరంలోని తెల్లాపూర్‌కు చెందిన కందూరు మోహన్ రెడ్డి, నిర్మల దంపతుల పెళ్లి రోజు, వారి మనుమరాలు మోక్ష పుట్టిన రోజు సందర్భంగా ఆర్‌కే పురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి రూ.2 లక్షలు విరాళంగా ఇచ్చారు. విరాళం చెక్కును మంగళవారం గృహం విద్యార్థులకు అధ్యక్షుడు మార్గం రాజేశ్ ఆధ్వర్యంలో అందజేశారు. తాము అందజేసిన విరాళంతో గృహంలోని విద్యార్థుల ఫీజుల చెల్లింపు, పుస్తకాల కొనుగోలుకు వినియోగించాలని దాత కోరారు. కార్యక్రమంలో మోహన్ రెడ్డి సతీమణి నిర్మల, కుమారుడు హరీష్ రెడ్డి, కోడలు హరిప్రియ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



హస్తినాపురంలో మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పొంగిపొర్లుతూ దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లోని అనుపమానగర్ కాలనీలో కొన్ని నెలలుగా మ్యాన్‌హోల్ పొంగి రోడ్లపై మురుగు పారుతోందని, సమస్య నివారణకు జలమండలి సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీవాసులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని వారు కోరుతున్నారు.

వ్యభిచార గృహంపై దాడి: ఇద్దరి అరెస్టు

నాగోలు: గుట్టు చప్పుడు కాకుండా ఓ ఇంట్లో వ్యభిచారం చేస్తున్న ముగ్గురిపై నాగోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, పరారీలో ఉన్న మరొకరి కోసం గాలిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంకు చెందిన కర్రి కృష్ణవేణి (29) నగరానికి వచ్చి బాలాపూర్‌లోని వివేక్‌నగర్‌లో నివాసం ఉంటోంది. అదే ప్రాంతంలో ఉండే రాణితో కలిసి నాగోలు సాయినగర్ కాలనీలోని ఓ పార్ట్‌మెంట్‌లో గదిని అద్దెకు తీసుకొని కొంత కాలంగా వ్యభిచారం గృహం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం అపార్ట్‌మెంట్‌పై దాడి చేశారు. వ్యభిచారం చేస్తున్న కృష్ణవేణి, పసుమాములకు చెందిన భాస్కర్‌గౌడ్‌ను పట్టుకున్నారు. వారి నుంచి సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్ తరలించామని, మరో నిర్వాహకురాలు రాణి పరారీలో ఉందని పోలీసులు తెలిపారు.

దాతల సాయంతో ఆలయాభివృద్ధి పనులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని బాలాజీ దేవాలయంలో ఉత్తర, పడమర ద్వారం పనులు పూర్తి కావడాన్ని పురస్కరించుకొని ఆలయ పాలక మండలి సభ్యులు మంగళవారం శిలాఫలకాన్ని ఆవిష్కరించి పూజలు నిర్వహించారు. పడమరవైపు సాలహారమును దాత దామోదర్ సచిన్ సోని, ఉత్తరం వైపు సాల హారమును ఎడ్ల కృష్ణారెడ్డి, ఎడ్ల రఘువీర్‌రెడ్డి, ఎడ్ల వాసుదేవారెడ్డిలు, ఉత్తర ద్వారం తలుపును బద్ధం జితేందర్‌రెడ్డి నిర్మించినందుకు ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల వెంకటేశ్ వాల్మీకి, సభ్యులు ఇసంపల్లి పద్మశంకర్‌గౌడ్, పెండ్యాల కృష్ణనాయి, సహదేవ్, అశోక్‌ముదిరాజ్, అర్చకుడు సుధీర్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాల 1998–99 బ్యాచ్ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని పోల్కంపల్లి ప్రభుత్వ పాఠశాల 1998–99 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. బొంగ్లూర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఈ వేడుక ఘనంగా జరిగింది. దాదాపు 25 సంవత్సరాలు తర్వాత అందరూ ఒక్కచోట చేరి అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో వారికి చదువు చెప్పిన గురువులు నెల్సన్, జగన్‌రెడ్డి, బాల్‌రాజ్, డేవిడ్, మల్లారెడ్డి, శేఖర్, బాలన్నను ఘనంగా సన్మానించారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

మొయినాబాద్: ప్రభుత్వం 60శాతం సబ్సిడీపై అందజేసే పచ్చిరొట్ట పైర్లకు సంబంధించిన విత్తనాలు(జనుములు) అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి రాగమ్మ తెలిపారు. మొయినాబాద్‌లోని పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ)లో 90 క్వింటాళ్ల జనుములు అందుబాటులో ఉన్నాయని బుధవారం రైతులకు అందజేస్తామని తెలిపారు. 40 కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.1448 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జనుములు కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ కాపీలు తీసుకుని వచ్చి మొయినాబాద్, కేతిరెడ్డిపల్లి క్లస్టర్‌లలోని రైతువేదికల వద్ద వ్యవసాయాధికారుల నుంచి పర్మిట్‌లు తీసుకొని జనుములు తీసుకోవాలన్నారు. మండలంలోని చిలుకూరు, హిమాయత్‌నగర్, దేవల్‌వెంకటాపూర్, నాగిరెడ్డిగూడ, బాకారం, ఎనికేపల్లి, అమ్డాపూర్, నజీబ్‌నగర్, ముర్తూజగూడ, మేడిపల్లి, చిన్నమంగళారం, మోత్కుపల్లి, రెడ్డిపల్లి, చందానగర్, అజీజ్‌నగర్, బంగాలిగూడ గ్రామాల రైతులు మొయినాబాద్ క్లస్టర్ రైతువేదికలో, నక్కలపల్లి, ఎత్‌బార్‌పల్లి, తోలుకట్ట, చాకలిగూడ, కేతిరెడ్డిపల్లి, సజ్జన్‌పల్లి, కనకమామిడి, పెద్దమంగళారం, చిన్నషాపూర్, వెంకటాపూర్, శ్రీరాంనగర్, సురంగల్ గ్రామాల రైతులు కేతిరెడ్డిపల్లి క్లస్టర్ రైతువేదికలో పర్మిట్లు తీసుకోవాలన్నారు.